థండా థండా.. COOL COOL



వేసవి సెగ మొదలైంది. భానుడు భగభగమని మండుతున్నాడు. ఉదయం నుంచే మాడు మాడిపోతోంది. బయటకు వచ్చిన ప్రజలు దాహంతో అల్లాడిపోయే పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు, వ్యాపారులకు కాస్త ఆదాయాన్నిచ్చే చలువ పదార్థాల దుకాణాలు సిద్ధమయ్యాయి. పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, చెరకురసం, మజ్జిగ, లస్సీ కేంద్రాలతో పాటు, మట్టి కుండలకు గిరాకీ పెరిగింది.

- ఊపందుకున్న 'చల్లని' వ్యాపారాలు
- ఎండల్లో చల్లదనానికి పుచ్చకాయలు
- చెరకురసంతో అలసట హుష్‌కాకి
- ఆరోగ్యానికి మేలు.. కొబ్బరి బొండాలు



పెందుర్తి: నగరంతో పోల్చితే వేసవి తాపం పెందుర్తి ప్రాంతంలో కాస్త తక్కువే. అయినా.. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే వేసవి తాపం మొదలయింది. మార్చి నెల ప్రవేశంతో ఎండలు మరింతగా భగ్గుమంటున్నాయి. దీంతో నియోజకవర్గంలో నోరూరించే పుచ్చకాయలతో పాటు, చెరకురసం, మజ్జిగ, కొబ్బరిబొండాలు, పండ్ల రసాల వ్యాపారం ఊపందుకుంది. రకరకాల మట్టికుండలు కూడా వేసవి దాహార్తిని తీర్చేందుకు మార్కెట్లను ముంచెత్తాయి.

పేదోడి ఫ్రిజ్.. మట్టి కుండ

మట్టికుండల వ్యాపారం వేసవిలో చక్కగా సాగుతుంది. పేరుకి పేదోడి ఫ్రిజ్‌గా పిలిచినా ప్రతి కార్యాలయం, ప్రతి ఇంట్లోనూ మట్టికుండ వేసవిలో తప్పక దర్శనమిస్తుంది. ఫ్రిజ్ నీటి మాదిరి కుండ నీరు చల్లగా ఉండి, తాగితే హాయినిస్తుంది.

చెరకు రసంతో ఉపశమనం



మండే ఎండలో ఒంట్లో శక్తి కోల్పోతే ఓ గ్లాసు తియ్యటి చెరకు రసం తాగితే చక్కటి ఉపశమనం కలుగుతుంది. గ్లాసు రూ.20కి దొరికే దీనికి, కాస్త నిమ్మరసం జోడించి తాగితే వచ్చే మజాయే వేరు. పైపెచ్చు ఇలా తాగితే ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. పెందుర్తి ప్రాంతంలో వందలాది మంది చెరకురసం వ్యాపారంపైనే జీవనం సాగిస్తున్నారు. నగరంలోని చెరకురసం వ్యాపారుల్లో 90 శాతం మంది పెందుర్తి ప్రాంతానికి చెందినవారేనంటే అతిశయోక్తి కాదు.

ఒక్కో కుండ పరిమాణం ఆధారంగా రూ.100–600 వరకు ధర పలుకుతోంది. కాస్త భారీ సైజ్ కుండలకు కుళాయిల్ని బిగించి మరీ విక్రయిస్తున్నారు. చాలా మంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.



పాపయ్యరాజుపాలెం వద్ద కుండలు విక్రయిస్తున్న వ్యాపారి

అమ్మకాలు బాగున్నాయి

మేం గుజరాత్ ప్రాంతం నుంచి ఇక్కడకు మట్టికుండలను తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నాం. మన దగ్గర తయారుచేసేవాటి కంటే ఇవి మరింత గట్టిగా ఉంటాయి. పరిమాణాన్ని బట్టి రూ.300 నుంచి రూ.600 వరకు చెబుతున్నాం. ఎండలు పెరగడంతో మట్టి కుండల విక్రయాలు పెరిగాయి. ప్రస్తుతానికి ఆదాయం బాగుంది.

– శివ, మట్టికుండల వ్యాపారి



భలేభలే పుచ్చకాయలు





దాదాపు తొంభై శాతం నీటితో ఉండే పుచ్చకాయలు పిల్లలు, పెద్దలు ఎంతో ఇష్టంగా తింటారు. వేసవిలో విరివిగా దొరికే వీటిని కిలో రూ.20–25 చొప్పున విక్రయిస్తున్నారు. స్థానికంగా ఉండే సబ్బవరంతో పాటు కె.కోటపాడు, శ్రీకాకుళం, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు తీసుకువస్తున్నారు. మండే ఎండలో దాహం తీర్చడంతోపాటు, నీరసాన్ని క్షణంలో తీసివేస్తుంది. శరీరంలో అధిక ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని కూడా అందిస్తుంది.

కొబ్బరి బొండాంతో తక్షణ శక్తి



ప్రకృతి సిద్ధమైన పోషక విలువలు కలిగిన నీటికి కొబ్బరి బొండాం ప్రసిద్ధి. వేసవితో పాటు అన్ని కాలాల్లోనూ ప్రజలకు ఆరోగ్యప్రదాయిని. సహజసిద్ధమైన పోషకాలు మెండుగా కలిగిన కొబ్బరి నీరు సేవిస్తే తక్షణ శక్తి సమకూరుతుంది. ఒక్కో కొబ్బరి బొండాం మార్కెట్‌లో రూ.25 నుంచి 50 వరకూ అమ్ముడుపోతుంది. వేసవిలో దీనికి డిమాండ్ విపరీతంగా ఉండడంతో వ్యాపారులు చక్కటి లాభాలు పొందుతున్నారు.

ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి

వేసవి ఎండల కారణంగా చెమట రూపంలో ఒంట్లోని నీరు బయటకు వెళ్లిపోతుంది. దీంతో తక్షణమే శరీరానికి నీరు అందించాల్సి ఉంటుంది. కనీసం అరగంటకోసారి సురక్షిత నీరు తాగాలి. శరీరానికి చల్లదనాన్నిచ్చే ద్రవపదార్థాలు తీసుకోవాలి. మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరిబొండాలు ఈ కాలంలో ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ అవంతి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెందుర్తి



క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో గ్రామ పెద్దలు

పరవాడ: తానాం గ్రామంలో ఈ నెల 11న జరగనున్న పరదేశిమాంబ పండగ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గ్రామ సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ సోమవారం ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.18 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు అందించనున్నట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది. తొలి రోజు దోసూరు, తానాం జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పైల కృష్ణారావు, గ్రామ పెద్దలు వర్రి వసంతరావు, వర్రి వెంకటరమణ, సతీష్, పైల అప్పారావు, రొంగలి అప్పారావు, పైల జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మహిళలు

పరవాడ: బాల్య వివాహాలు, లింగ సమానత్వం, మహిళా చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.కె.షకీలా, పి.లక్ష్మిలు సూచించారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గొర్లివానిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, దేవి, విజయలక్ష్మి, అర్జునమ్మ, భవాని, జానకి, సత్యవతి, గ్రామ సచివాలయ సంరక్షకులు యశోద, రామలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బీమా చెల్లించాల్సిందే..



మాట్లాడుతున్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామఅప్పారావు

అగనంపూడి: ఎనిమిదేళ్ల కిందట ఉక్కు కర్మాగారంలో ప్రమాదవశాత్తు మరణించినా బీమా సొమ్ము చెల్లించని బజాజ్ ఏలియంజ్ ఇన్‌స్రూ సంస్థను జిల్లా వినియోగదారుల కమిషన్–2 వెంటనే పరిహారంతో పాటు వడ్డీ, మానసిక క్షోభకు గురి చేసినందుకు కొంత మొత్తం చెల్లించాలని ఆదేశించారని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు చెప్పారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు.

2017లో ఉక్కు అధికారి విధినిర్వహణలో మృతిచెందారని, అయితే ప్రమాదవశాత్తు మరణం కాదని ఇన్‌స్రూ సంస్థ బీమా సొమ్ము చెల్లించడానికి నిరాకరించడంతో ఏడాది కిందట పలు ఆధారాలతో జిల్లా వినియోగదారుల కమిషన్–2 జి.వెంకటేశ్వరికి ఫిర్యాదు చేశానని చెప్పారు. వాస్తవాలు పరిశీలించిన కమిషన్ నష్ట పరిహారంపాటు 6 శాతం వడ్డీ, మానసిక క్షోభకు గురిచేసినందుకు ఆ కుటుంబానికి అదనంగా మరో లక్ష చెల్లించాలని ఆదేశించిందన్నారు. అలాగే 2020లో ఉక్కులోనే రైలు ప్రమాదంలో మృతి చెందిన పూర్ణచంద్రరావు విషయంలో కూడా ఇలాగే సంస్థ తిరస్కరించడంతో కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వివరాలు, వాస్తవాలు పరిగణలోకి తీసుకుని పరిహారంతో పాటు 6శాతం వడ్డీ, మానసిక క్షోభకు గురిచేసినందుకు మరో రూ.30వేలు చెల్లించాలని కమిషన్ తీర్పునిచ్చిందని రామ అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత



పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

కూల్చివేతలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని సర్వే నెంబర్ 50లో, ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సూచనలతో ఆర్‌ఐ దివ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల బృందం జేసీబీ సహాయంతో ఈ నిర్మాణాన్ని తొలగించింది. ఇక్కడి ప్రభుత్వ భూమిని ఆక్రమించి, కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై గత నెల 10న 'కొనసాగుతున్న కూటమి కబ్జాలు' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పలుమార్లు చర్యలు తీసుకునేందుకు వెళ్లగా 'కూటమి' పెద్దలు రంగంలోకి దిగి అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఎట్టకేలకు సోమవారం పోలీసుల సహాయంతో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని అధికారులు తొలగించారు.

గుంతలు పూడ్చిన మూడు మాసాలకే గోతులు



ఊటగెడ్డ సమీపంలో పాత ఇటుకల పరిశ్రమ వద్ద ధ్వంసమైన రోడ్డు



ప్రజయ్ లేఅవుట్ వద్ద ఛిద్రమైన రహదారి

పరవాడ: కూటమి ప్రభుత్వం మూడు నెలల క్రితం చేపట్టిన రహదారి గుంతల పూడ్చివేత మూణ్నాళ్ల ముచ్చటగా మారడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. మండల పరిధిలో వాడచీపురుపల్లి–ఊటగెడ్డ కూడలి, పరవాడ సబ్‌స్టేషన్ కూడలి ప్రాంతాల్లో గుంతల మయంగా మారిన రోడ్లను కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేపట్టింది. అయితే రోడ్ల మరమ్మతుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించని కారణంగా మూడు నెలలు తిరక్క ముందే వాడచీపురుపల్లి–ఊటగెడ్డ రహదారి మరమ్మతులకు నోచుకుంది. గుంతల్లో వేసిన పిక్కలు పైకితేలి, మళ్లీ గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలిలో కూడ ఇదే పరిస్థితి. నాలుగు రోడ్ల కూడలిలో పూడ్చిన గుంతలు యథావిధిగా భారీ గుంతలుగా మారిపోయి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో ఏర్పడిన రోడ్డు గుంతలను పూడ్చడానికి చర్యలు చేపట్టకపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. ఛిద్రమైన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



విస్తం కళాశాలలో క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న మళ్ల విజయ్‌ప్రసాద్

పెందుర్తి: విద్యార్థులు తరచూ క్రీడల్లో పాల్గొనడం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉత్తేజం కలిగి చదువులో మరింతగా రాణిస్తారని మాజీ ఎమ్మెల్యే, వెల్ఫేర్ గ్రూప్ అధినేత, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మళ్ల విజయ్‌ప్రసాద్ అన్నారు. పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో 'స్పోర్ట్స్ వీక్–2025' సోమవారం ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మళ్ల మాట్లాడుతూ విద్యార్థుల మధ్య పోటీ తత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంచేలా కళాశాలలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విస్తం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది పతకాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులంతా క్రీడలతో పాటు చదువులో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తొలి రోజు పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రెసిడెంట్ మళ్ల అనూష, వైస్ ప్రెసిడెంట్ బొల్లినేని సందీప్, కార్యదర్శి అప్పాని రాహుల్, ట్రెజరర్ మళ్ల అలేఖ్య, మళ్ల అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ సర్పంచ్ బయిలపూడి భగవాన్ జయరామ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో థర్మల్ కంఫర్ట్ కీలకం

అగనంపూడి: గృహ, వంతెన నిర్మాణాల్లో థర్మల్ కంఫర్ట్ కీలకమైన పరికరమని ఐఐటీ (వరంగల్) ప్రొఫెసర్ కె.కిరణ్‌కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సోమవారం థర్మల్ కంఫర్ట్ ప్రాధాన్యం, విశిష్టత అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడం, ఆర్గానిక్, పారిశ్రామిక శీతలీకరణ, భవన నిర్మాణ డిజైన్ రూపొందించడంలో వీటి ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి రాంబాబు పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



శివప్రసాద్

పెందుర్తి: స్థానిక జేఎన్ఎన్‌యూ ఆర్ఎం(అయ్యప్ప) కాలనీకి చెందిన నరవ శివప్రసాద్(34) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న శివప్రసాద్ ఆరిలోవలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న రాత్రి డ్యూటీ పేరిట వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం కనిపించలేదు. దీంతో అతడి తండ్రి వెంకట్రావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కోదండరామాలయ వార్షికోత్సవం



పూజలందుకున్న సీతారాములు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి, భగవాన్ జయరాం

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో కొలువుదీరిన సంపత్ వినాయక పూర్వక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత సీతాకోదండరామాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు విశేష అభిషేకాలు జరిపారు. అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు భజనలు చేశారు. ప్రముఖ వ్యాపార వేత్త చందు రామచంద్రరావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. దాదాపు 2 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం జరిగిన పరసలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, నాయకులు బయిలపూడి హరగోపాల్, సబ్బవరపు రామ్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు, వందలాదిగా భక్తులు సీతారాములను దర్శించుకున్నారు.

ధ్యానం మానవ జీవనంలో భాగం కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సేత్ బాలకృష్ణ



ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని ధ్యాన గ్రాండ్ మాస్టర్ సేత్ బాలకృష్ణ సూచించారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో సోమవారం స్పిరిచ్యువల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో అవసరం అన్నారు. ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, నిరంతర జీవన ప్రక్రియలో ధ్యానం ఆవశ్యకతను సోదాహరణంగా తెలిపారు. ధ్యాన మాస్టర్లు శ్రీనివాసరావు, శ్రీధర్, రామాచారి, సీనియర్ కౌన్సిలర్లు, ధ్యాన కేంద్ర నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు పాల్గొన్నారు.

వైభవం.. అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో స్వామివారి ఆలయం



స్వామి సన్నిధిలో డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని గొటివాడలో కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వేకువ జామునే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి ఆచార్య సూర్యప్రకాశరావు స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన చేతుల మీదుగా గ్రామంలోని 20 మంది పేదలకు రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్వామి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరిపారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకున్నవారిలో మాజీ సర్పంచ్ వడిశల రమేష్, వడిశల శ్రీరాం, బోండా సత్యారావు, వడిశల లక్ష్మణ, సాలాపు సూరిబాబు ఉన్నారు.

చంద్రబాబు పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం

- ఉత్తరాంధ్ర దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు ఐడి బాబు

సబ్బవరం: చంద్రబాబు తన నిరంకుశ పాలనతో దళిత అధికారులు, ప్రజా ప్రతినిధులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఉత్తరాంధ్ర దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు ఐడి బాబు సోమవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎర్రబుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, స్వార్థపూరిత, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళిత ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేసి దళిత వ్యతిరేకిగా, దళిత ద్రోహిగా మరోసారి చంద్రబాబు తనను తాను నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారని సస్పెండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజానికి కూటమి ప్రభుత్వం అనుమతితో, తన సొంత ఖర్చులతో విదేశాలకు వెళ్లారని, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా దళిత ఐపీఎస్ అధికారిపై కుట్రపూరిత చర్యలు తీసుకోవడాన్ని ఖండించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో దాదాపు 10 మంది దళిత ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, 50 మంది దళిత పోలీస్ అధికారులు, నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పోస్టింగ్‌లు, పదవులకు దూరం చేశారని పేర్కొన్నారు. దళిత వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.